
సాక్షి నిర్మల్

బుధవారం । 17 । జూలై । 2024



కొలువు కొట్టాల్సిందే..! 8లో

ఉపాధ్యాయ కొలువు కోసం పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగుల స్వప్నం సాకారం చేసుకునే తరుణం రానేవచ్చింది. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి.



ఇక నాణ్యమైన విద్యుత్.. 9లో

కడెం మండలంలోని అటవీ గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు దత్తోజీపేట్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుంది. ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.5 /24.8

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన సేవలు

- డీఎంహెచ్‌వో ధనరాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన సేవలు అందించడంలో వైద్యులు సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రిలో మంగళవారం వైఆర్జికేర్ లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ప్రసూతి ఆస్పత్రి, జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులకు నర్సింగ్ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపకుండా వారికి మనోధైర్యం కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు ఐసీటీసీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సన్మానం పొందిన వారిలో వైద్యులు ప్రమోద్‌రెడ్డి సమత విన్నీ జమున, నళిని, సింధూజ, అరుణ్‌కుమార్‌రెడ్డి, గణేశ్, నర్సింగ్ సూపరింటెండెంట్లు ధనలక్ష్మి, విజయలక్ష్మి, హెడ్ నర్సులు జయలక్ష్మి, లింకు వర్కర్ స్కీం డీఆర్పీ సరిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఆటల పోటీలు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు లక్ష్యే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్లు రీజినల్ డిప్యూటీ మేనేజర్ ప్రణీత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలు, చెస్, క్యారం తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సిబ్బంది చందు, భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం..!




బ్రహ్మ కమలాల వద్ద పూజలు నిర్వహిస్తున్న లత - పోశెట్టి దంపతులు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ మాజీ ఎంపీటీసీ పెద్దింటి లత–పోశెట్టి దంపతుల ఇంటి ఆవరణలో మంగళవారం వేకువజామున అరుదైన మూడు బ్రహ్మ కమలాలు వికసించాయి. శివునికి బ్రహ్మ కమలం అంటే ఇష్టమని, వికసించిన వెంటనే మూసుకుపోవడం బ్రహ్మ కమలం ప్రత్యేకత అని పలువురు తెలిపారు. స్థానికులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇంటి ఆవరణలో మూడు బ్రహ్మ కమలాలు వికసించడం ఎంతో ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

స్వర్ణ ప్రాజెక్టుకు వరద

సారంగపూర్: ఎగువన ఉన్న మహారాష్ట్రలో సోమవారం రాత్రి, మంగళవారం వేకువజామున కురిసిన భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టులోకి రెండు అడుగుల మేర నీరు చేరిందని జేఈ మధుపాల్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు(1.484టీఎంసీ)లు కాగా, ప్రస్తుతం 1,170.5 అడుగులు(0.561 టీఎంసీ)ల నీరు ఉందని వివరించారు. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే వారంలో పూర్తిగా నిండుతుందని తెలిపారు.

పాస్ బుక్‌తోనే మాఫీ



- రేషన్‌కార్డు గుర్తింపు కోసమే..
- రేపటి నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ
- రూ.లక్షలోపు రుణాలు మొదట..
- 18న రైతువేదికల్లో సంబురాలు

నిర్మల్: ఎప్పుడెప్పుడా అని రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీ గడియ రానే వచ్చింది. ఈనెల 18 నుంచి అమలు చేయనున్నట్లు హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇక రేషన్‌కార్డు రైతు గుర్తింపు కోసమేనని, పట్టాదారు పాసుపుస్తకం ఉంటే సరిపోతుందని స్పష్టత ఇచ్చారు. గురువారం సాయంత్రం నుంచి రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ముందుగా రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాలో 1.90 లక్షలకుపైగా పాసుపుస్తకాలు ఉండగా, దాదాపు లక్ష మంది రైతులకు రుణమాఫీతో లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

ఏళ్లుగా ఎదురుచూపులు..

గత ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడం, కొంతమందికి అసలే కాకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారు. తీసుకున్న రుణాలకు వడ్డీలు కడుతూ వచ్చారు. అసలు లెక్క లక్ష దాటిపోవడంతో చెల్లించడం కష్టంగా మారింది. ఈక్రమంలో జిల్లాలోని కొంతమంది రైతులకు పలు బ్యాంకులు నోటీసులను పంపించాయి. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో చాలామంది రైతులు అదే భరోసాతో ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంకెప్పుడు తమ రుణభారం తీరుస్తారోనని ఎదురుచూశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు హామీ ఇచ్చారు. ఈమేరకు కలెక్టర్ల సమావేశంలో గురువారం నుంచి ఈప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

రేషన్‌కార్డుపై స్పష్టత..

రేషన్‌కార్డు ఉంటేనే రైతు రుణమాఫీ అవుతుందన్న ప్రచారాన్ని కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కొట్టిపారేశారు. రేషన్‌కార్డు అనేది కేవలం రైతుల గుర్తింపు కోసమేనని, రుణమాఫీకి పట్టాదారు పాసుపుస్తకం ఉంటే సరిపోతుందని స్పష్టత ఇవ్వడంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రుణమాఫీపై ప్రకటన రావడంతో చాలామంది రైతులు ఈ ఏడాది వడ్డీలు చెల్లించేస్తున్నారు. వడ్డీ సక్రమంగా చెల్లించి, రెన్యూవల్ చేయించుకుంటే ఏ ఇబ్బంది ఉండదని బ్యాంకుల సిబ్బంది సూచించడంతో చాలామంది ముందుకు వస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులలో సోమ, మంగళవారాల్లో అధికసంఖ్యలో రైతులు వడ్డీ డబ్బులు చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకున్నారు.

లక్షకు పైగానే..

జిల్లాలో రైతులు 1.50 లక్షల మంది వరకు ఉన్నారు. వివిధ గ్రామాల్లో సాగు భూములు ఉండటంతో ఆయా గ్రామాల పరిధి భూమికి సంబంధించి వేర్వేరు పట్టా పాసు పుస్తకాలు ఇస్తారు. ఈలెక్కన జిల్లాలో మొత్తం 1.90 లక్షల ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. ఇక బ్యాంకుల నుంచి క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు లక్ష వరకు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో సగానికిపైగా రైతులు ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీకి అర్హులు కానున్నట్లు లెక్కలు వేస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించడంతో అదేరోజు రైతువేదికల్లో రైతులతో సంబురాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తం చేస్తోంది. ఈమేరకు కలెక్టర్ల సమావేశంలో సీఎం పలు సూచనలనూ చేశారు. రైతు రుణమాఫీలో ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులందరికీ న్యాయం చేయాలని ఆదేశించారు.

సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



సీఎంతో సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో కలెక్టర్, ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ల, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలు, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్చలు, విద్య, వైద్యం తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈనెల 18 నుంచి రైతు రుణమాఫీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడ్‌చాంద ఎత్తిపోతల పథకం కమిటీని రద్దుచేయాలి

- డీసీవోకు రైతుల ఫిర్యాదు



డీసీవోకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

లోకేశ్వరం: ఎత్తిపోతల పథకం కమిటీని రద్దు చేయాలని గడ్‌చాంద ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని గడ్‌చాంద లక్ష్మీనర్సింహా ఎత్తిపోతల పథకం చైర్మన్, కమిటీ సభ్యులు రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు డీసీవో పాపయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయకున్నా.. చేసినట్లు తప్పుడు నివేదికలు తయారు చేసి రైతుల నుంచి సాగునీటి పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకుంటున్నారని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న ఎత్తిపోతల కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎత్తిపోతల పథకం రైతులకు మహాజన సభ నిర్వహించకుండా ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కమిటీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులను మెకానిక్‌లుగా నియమించి మోటార్లు బాగానే ఉన్నప్పటికీ మరమ్మతులు చేసినట్లు తప్పు డు నివేదికలు తయారు చేస్తున్నారని ఆరోపించారు.

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగింపు

భైంసాటౌన్: సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగిస్తామని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీట్ ఉన్నవారు ఎలాంటి నేరాలకు పాల్పడొద్దన్నారు. తీరు మార్చుకోకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు. రానున్న గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఐ డి.రాజారెడ్డి, ఎస్సై ఎండీ.గౌసుద్దీన్ పాల్గొన్నారు.

నర్సాపూర్ ఆస్పత్రి ఎక్కడ?



నర్సాపూర్(జి) ఆసుపత్రి ఇదే..

- వైద్యవిధానపరిషత్ జాబితాలో కనిపించని పేరు
- సాధారణ బదిలీల వెబ్‌సైట్‌లోనూ చూపించని వైనం..
- ఉన్నవారు బదిలీ అయితే ఇక ఖాళీలే..
- వైద్య సిబ్బంది బదిలీల్లో గందరగోళం..

నిర్మల్‌చైన్‌గేట్: నర్సాపూర్(జి) ఆసుపత్రి.. రెండేళ్ల క్రితం వరకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) పరిధిలో ఉండేది. ముధోల్‌తోపాటు నర్సాపూర్(జి) ఆస్పత్రిని వైద్యవిధానపరిషత్‌లోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ప్రస్తుతం ఆ ఆస్పత్రి ఎక్కడుందో తెలియడం లేదు. వైద్యవిధానపరిషత్ ఆస్పత్రుల జాబితాలో నర్సాపూర్(జి) ఆస్పత్రి పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఆస్పత్రి వైద్యవిధానపరిషత్‌లో చేర్చారా..? లేదా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు ఈనెల 19 నుంచి వైద్యుల బదిలీల ప్రక్రియ ప్రారంభంకానుంది. అసలు వెబ్ కౌన్సెలింగ్‌లో కూడా ఆస్పత్రి పేరు లేకపోవడం గమనార్హం. దీంతో వైద్యులు ఈ ఆస్పత్రిని ఆప్షన్‌గా పెట్టుకునే వెసులుబాటు లేకుండాపోయింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చాలామంది సిబ్బంది డిప్యూటేషన్‌పైనే పనిచేస్తున్నారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది మరో ఆస్పత్రికి బదిలీ అయితే ఈ ఆస్పత్రికి ఎవరూ వచ్చే పరిస్థితి లేదు.

టీవీవీపీకి మారినా రికార్డులో లేదు..

నర్సాపూర్(జి) ఆస్పత్రిని రెండేళ్ల క్రితం తెలంగాణ వైద్యవిధానపరిషత్‌లోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారికంగా మాత్రం రికార్డులో లేదు. ఆస్పత్రి గురించి ఆలోచించే వారు కరువయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి ఎటూకాకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వైద్య విధానపరిషత్‌లోకి మార్చుతున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఇప్పటివరకు ఆస్పత్రి అభివృద్ధి నిధులు మంజూరు కాలేదు.

అయోమయంలో వైద్యులు..

జిల్లాకేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో పనిచేసిన సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ అశ్వేర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, మమత డిప్యూటేషన్‌పై నర్సాపూర్(జి) ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో ప్రస్తుతం మండల ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యుల బదిలీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించనుండడంతో ఇక్కడి నుంచి వైద్యులు ఇతర ఆస్పత్రికి బదిలీపై వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు బదిలీల వెబ్ కౌన్సెలింగ్‌లో నర్సాపూర్(జి) ఆస్పత్రి పేరు లేకపోవడంతో ఇక్కడకు ఎవరూ వచ్చే అవకాశం లేకుండా పోయింది. వైద్యశాఖ ఉన్నతాధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు అనుమతి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

317 జీవోలో 14 మంది స్టాఫ్ నర్సులు...

ఇదిలా ఉంటే ప్రభుత్వం ఇటీవల 317 జీవోని తెలంగాణ వైద్య విధానపరిషత్ ఆస్పత్రుల్లో కూడా అమలు చేసింది. ఇందులో భాగంగా జిల్లా జనరల్ ఆస్పత్రి మెడికల్ కళాశాలకు కేటాయించడంతో అక్కడ పనిచేసే స్టాఫ్‌నర్సులకు వైద్యవిధానపరిషత్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 14 మంది స్టాఫ్ నర్సులు కౌన్సెలింగ్‌లో నర్సాపూర్(జి) ఆస్పత్రిని ఎంచుకున్నారు. ప్రస్తుతం నర్సాపూర్(జి) ఆస్పత్రిలో తెలంగాణ వైద్యవిధానపరిషత్ అధికారులు కేవలం స్టాఫ్ నర్సులకు మాత్రమే ఆప్షన్‌ను చూపించారు. మిగతా కేటగిరీల్లో ఖాళీ స్థానాలు చూపించకపోవడంతో వైద్యులు అయోమయానికి గురవుతున్నారు.

అంగన్‌వాడీలకు ‘బెనిఫిట్’

- రిటైర్మెంట్ ప్రోత్సాహం పెంచిన ప్రభుత్వం
- టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష..
- జిల్లాలో ప్రస్తుతం 123 మందికి లబ్ధి

ప్రాజెక్టుల వారీగా రిటైర్ అయిన సిబ్బంది

ప్రాజెక్టు	అంగన్‌వాడీ టీచర్లు	హెల్పర్లు
భైంసా	11	14
నిర్మల్	09	36
ముధోల్	07	25
ఖానాపూర్	00	21



ఆర్డీవో కార్యాలయం ఎదుట 13 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రేవంత్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వాళ్ల ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదవీ విరమణ పొందే టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వనున్నట్లు ప్రకంటించింది. హైదరాబాదులో ‘అమ్మ మాట – అంగన్వాడీ బాట’ అనే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.

రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణ వయసును ప్రభుత్వం 65 ఏళ్లుగా నిర్ణయించింది. వీరు ఉద్యోగ విరమణ పొందే సమయంలో ప్రయోజనాలు(బెనిఫిట్స్) కల్పించాలని నిర్ణయం తీసుకుంది. టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు లక్ష రూపాయలు ఇవ్వాలని రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

జిల్లాలో 926 కేంద్రాలు

జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, ముధోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 816 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. మరో 110 మినీ కేంద్రాలున్నాయి. ప్రధాన కేంద్రాల్లో టీచర్, ఆయా, మినీ కేంద్రాల్లో టీచరే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మినీ సెంటర్లలోనూ టీచర్, ఆయా ఉండాల్సిందేనని ప్రభుత్వం చెప్పినా ఇంకా భర్తీ చేయలేదు. ఇప్పటిదాకా అంగన్‌వాడీల్లో రిటైర్మెంట్ ప్రక్రియ లేక వయసు పైబడిన వారిస్థానంలో కుటుంబీకులు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ కల్పించి బెని ఫిట్స్ ఇవ్వాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు.

123 మంది సర్వీస్ నిలిపివేత..

ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో 65 ఏళ్ల పైబడిన టీచర్లు, ఆయాల వివరాలను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులకు సమర్పించారు. ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏళ్ల నిండాల్సి ఉండగా.. పదో తరగతి మెమో, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్ ఆధారంగా వయసు నిర్ధారించారు. అధికారులు సేకరించిన వివరాల మేరకు జిల్లాలో 65 ఏళ్ల పైబడిన 27 మంది టీచర్లు, 96 మంది ఆయాల సర్వీస్ నిలిపివేశారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదించారు.

ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు..

గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వనున్నట్లు జీవో జారీ చేసింది. జీవో వెలువడిన అనంతరం ఇతర సమస్యలతోపాటు ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్‌వాడీలు 24 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేశారు. దీంతో నాటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు బెనిఫిట్స్ పెంచుతామని హామీ ఇవ్వడంతో గతేడాది అక్టోబర్ 4న సమ్మెను విరమించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హామీ నెరవేరలేదు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి వచ్చింది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 7న ఐసీడీఎస్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా చేశారు. కానీ వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కానీ ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని బెనిఫిట్స్ అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం నోటి మాటగా రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున ప్రకటించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడే వరకు నమ్మే పరిస్థితి లేదు. 13 రోజులుగా న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ ధర్నాలు చేస్తున్నాం. రిటర్మెంట్ తర్వాత ఇస్తాను అన్న ఆసరా పెన్షన్ పేరు మార్చి దానికి డిపార్ట్‌మెంట్ పేరు పెట్టాలి. గతంలో ఇచ్చిన జీవో 10 రద్దు చేయాలి. – రాజమణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

న్యాయం చేయాలి..



పిల్లలకు దశాబ్దాలుగా అన్నిరకాల సేవలు చేశాం. మాకు న్యాయం చేయాలి. ఏళ్ల తరబడి పని చేసినందుకు ప్రభుత్వం ఆదుకోకపోతే మా కుటుంబాలు రోడ్డున పడుతాయి. ప్రభుత్వం స్పందించి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ కూడా ఇవ్వాలి. – లక్ష్మి, ఆయా, కంకట

జీవో వస్తేనే నమ్ముతాం..



30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. మూడేళ్లుగా ఆన్‌లైన్ పని పేరిట ఒత్తిడి పెరిగింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచడం సంతోషం. కానీ జీవో ఇవ్వకుంటే మళ్లీ ధర్నా చేస్తాం. – విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, సారంగాపూర్

పెన్షన్ ఇవ్వాలి..



నేను 275 రూపాయల జీతంతో ఉద్యోగంలో చేరాను. జీతం సరిపోకున్నా పిల్లల ఆలనాపాలన చూసుకున్నా. గతంలో జారీ చేసిన జీవో 10ని వెంటనే రద్దుచేసి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలి. – సరోజ, అంగన్‌వాడీ టీచర్, బంగల్‌పేట్

ఘనంగా శీత్లా పండుగ



ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాలో శీత్లా భవానీ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా బంజారా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పూజలు నిర్వహించారు. అనంతరం పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

నృత్యం చేస్తున్న బంజారా మహిళలు

‘కడెం’కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. సోమవారం సాయంత్రం 889 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం 3,336 క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 684.875(4.285టీఎంసీ)లకు చేరిందని పేర్కొన్నారు.



నీటితో కళకళలాడుతున్న కడెం ప్రాజెక్ట్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యువ పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న భీమేశ్

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన యువకవి, కళాకారుడు, శిల్పి పోలీస్ భీమేశ్ తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి యువ పురస్కారం అందుకున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేటకు చెందిన భీమేశ్ సారస్వత పరిషత్తు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జె.చెన్నయ్య చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే తొలి కవిత సంపుటికిగానూ పురస్కారం వరించింది.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిని చూపుతున్న మహిళ

తాంసి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మంగళవారం భీంపూర్ మండలంలోని కరంజి(టి)లో బౌరే శాంతాబాయికి చెందిన ఇల్లు కూలింది. సమయానికి ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

'ప్రతీ రైతుకు రుణమాఫీ జరగాలి'

ఆదిలాబాద్‌రూరల్: పంట పండించి దేశానికి అన్నం పెట్టే ప్రతీ రైతుకు రుణమాఫీ, రైతు భరోసా అందాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అనేక ఏళ్లుగా ప్రభుత్వం రేషన్ కార్డులే ఇవ్వలేదని అలాంటిది రేషన్ కార్డు ప్రాతిపదికన కుటుంబాలను గుర్తించడమనేది సరైన పద్ధతి కాదన్నారు. బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ జరగాలన్నారు. అలాగే రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీజేపీ నాయకులకు బెయిల్ మంజూరు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనపై బీజేపీ నాయకులపై కేసు నమోదు కాగా సోమవారం పోలీసులు వారిని జైలుకు తరలించారు. మొత్తం 32 మందిపై కేసు నమోదు కాగా పది మంది పరారీలో ఉన్నారు. మంగళవారం ఆరుగురిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వీరితో పాటు మొత్తం 22 మందికి బెయిల్ మంజూరైనట్లు న్యాయవాది, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్రాల నగేష్ తెలిపారు. బీజేపీ నాయకులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసు వాహన అద్దాలు ధ్వంసం చేశారని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

కొలువు కొట్టాల్సిందే...!

- వ్యూహం అనుసరిస్తే విజయం మనదే...
- ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి 30వేల దరఖాస్తులు
- ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు
- తీవ్ర పోటీ. ఒత్తిడి నడుమ పరీక్షలకు అభ్యర్థులు
- ప్రణాళికతో చదివితే కొలువు సులువేనంటున్న నిపుణులు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో సిద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ఉపాధ్యాయ ఖాళీలు, అందిన దరఖాస్తులు

జిల్లా	ఖాళీలు	దరఖాస్తులు
నిర్మల్	342	6,035
ఆదిలాబాద్	324	9,569
మంచిర్యాల	288	8,262
ఆసిఫాబాద్	341	5,677
మొత్తం	1,295	29,543

నిర్మల్‌ఖిల్లా: కొన్నేళ్లుగా నిరంతరం పుస్తకాలతోనే కుస్తీ పడుతూ శ్రమిస్తున్న నిరుద్యోగుల చిరకాల స్వప్నం ఉపాధ్యాయ ఉద్యోగం. ఈ కలను సాకారం చేసుకునే తరుణం రానేవచ్చింది. నిరుద్యోగులు ఎంతగానో ఎదురుచూస్తున్న డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఒకవైపు పరీక్షలు వాయిదా వేయాలంటూ కొంతమంది అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా...పరీక్షలు నిర్వహించడానికే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఇప్పటికే హాల్ టికెట్లను కూడా జారీ చేసింది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటిఫికేషన్ ప్రకారం 1,295 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా దాదాపు 30 వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రెండో నియామక పరీక్ష

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017 జూలైలో మొదటి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడేళ్ల అనంతరం నిర్వహిస్తున్న రెండో నియామక పరీక్ష ఇది. ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించే పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 29,543 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఒక్కో జిల్లా అభ్యర్థులకు ఒక్కోరోజున ఆయా జిల్లాల వారీగా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు విడతలుగా నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో తీవ్ర పోటీ ...

గత ప్రభుత్వం 2023లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయగా అందులో పోస్టుల సంఖ్య తక్కువగా ఉందని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని బీఈడీ, డీఈడీ, తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసుకుని టెట్ అర్హత సాధించిన దాదాపు 30 వేల మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తులు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 9,569, నిర్మల్ జిల్లాలో 6,035, మంచిర్యాల జిల్లాలో 8,262, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5,677 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రిపరేషన్ కోసం మరింత సమయం కేటాయించాలని, మరిన్ని ఖాళీలను జత చేసిన అనంతరమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు పరీక్షలు కచ్చితంగా నిర్వహించి తీరుతామంటూ కృత నిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. ఈ నెల 18 నుంచి జిల్లాల వారీగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. హాల్‌టికెట్లు కూడా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దాని ప్రకారం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ వివిధ సబ్జెక్టులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, నల్గొండ, తదితర ప్రాంతాలకు పరీక్షల సమయంలో అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పరీక్షకు ఒక రోజు ముందు ఇలా...

- ఒకరోజు ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అభ్యర్థులు ముందు రోజున ప్రిపరేషన్ కంటే కూడా పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి.
- ముందు రోజు రాత్రి అభ్యర్థులు ప్రశాంతంగా నిద్రపోవాలి. పరీక్ష రోజున నిర్దేశిత సమయానికంటే ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. కేటాయించిన స్థలం, కంప్యూటర్ పనితీరు సరిచూసుకుని కూర్చున్న తర్వాత ఇచ్చిన సూచనలకనుగుణంగా ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- తెలిసిన సమాధానాలు గుర్తించిన తర్వాతే ఎలిమినేషన్ విధానం ద్వారా సమాధానం ఊహించి మిగతా ప్రశ్నలకు జవాబులను గుర్తించాలి. టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండనుండడంతో 80 మార్కులకు డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నారు. ఒక్కో ప్రశ్నకు అరమార్కు చొప్పున 160 ప్రశ్నలుంటాయి.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత...

ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,295 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లోని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారు. ఇటీవల నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియతో జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఈ డీఎస్సీ ద్వారా ఎంపికయ్యే ఉపాధ్యాయులను వాటిలో భర్తీ చేయడం ద్వారా కొరత తీరనుంది.

ఒత్తిడికి గురికావొద్దు...



డీఎస్సీ పరీక్షలో ప్రతిప్రశ్న కూడా అత్యంత విలువైనదే. భవిష్యత్‌ను నిర్దేశించే విధంగా ఉంటుంది. కాబట్టి ప్రతీ ప్రశ్నకు అత్యంత జాగ్రత్తగా సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా సమాధానాలు రాబట్టాలి. తెలియని ప్రశ్న వద్ద ఆగిపోకుండా దానిని వదిలేసి ముందుకెళ్లాలి. ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోయినా ఆందోళనకు గురికాకుండా మిగతా వాటికి సమాధానాలు గుర్తించాలి. – కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోటీ పరీక్షల నిపుణులు, నిర్మల్

కొలువు సులువు..



పరీక్ష సమయంలో ప్రశాంతంగా ఉండాలి. చదివిన అంశాలన్నీ గుర్తుండాలంటే ఒత్తిడికి లోను కాకుండా ఒక్కో ప్రశ్నకు సమాధానాన్ని చాలా రిలాక్స్‌డ్‌గా గుర్తించాలి. ప్రశ్నను చదివిన వెంటనే తొలిసారిగా మనసులో మెదిలే సమాధానమే కరెక్ట్. ప్రణాళికాబద్ధంగా అసందిగ్ధతకు తావులేకుండా ప్రశ్నలకు సమాధానాలను గుర్తిస్తూ పోతే లక్ష్యానికి చేరువవుతాం. అనుకున్న ఉపాధ్యాయ కొలువు సులువుగా చేజిక్కుతుంది. – శింధే దత్తాద్రి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, 2017 టీఆర్టీ ఉమ్మడి జిల్లా టాపర్, భైంసా

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



రామ్‌కుమార్ (ఫైల్)

భైంసారూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కొండ్ర రామ్‌కుమార్ (27) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పురుగుల మందుతాగి ఒకరు..

కడెం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన పందిరి గంగారాం (27)మద్యానికి బానిస కావడంతో ఈ నెల 10న అతని తల్లి, భార్య మందలించారు. దీంతో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ముందుగా ఖానాపూర్, అక్కడి నుంచి నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఈ నెల15న రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని గోండియాకు లారీలో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ఆదిలాబాద్‌రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఏఎస్సై జుల్ఫెకార్ (సలీం) తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు లారీలో తరలిస్తుండగా తమకు వచ్చిన సమాచారం మేరకు మావల, ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్ ప్రాంతంలో సుమారు 24 టన్నుల బియ్యం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం తరలిస్తున్న సర్కిల్ సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే

తలమడుగు: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అన్ని మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని రుయ్యాడిలో మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పీరీలకు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారన్నారు. హుస్సేన్ హుస్సేన్ దేవస్థానానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, మండల కన్వీనర్ తోట వెంకటేష్, యువ నాయకులు అభిరాం రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అబ్దుల్లా, ఎల్మా శ్రీనివాస్ రెడ్డి, పోతారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గంగాధర్, సతీష్‌రెడ్డి, ప్రవీణ్, రాజు, నర్సింహులు, పొచ్చన్న, గజానంద్, రమాకాంత్, కొడాల మహేందర్, రాజు, రాకేష్, మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

హుస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో ఏఎస్పీ పూజలు

తలమడుగు: మండలంలోని రుయ్యాడిలో ఉన్న హుస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో ఆదిలాబాద్ అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి పీరీల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఫణీందర్, మాజీ సర్పంచ్ పోతరెడ్డి, జీవన్‌రెడ్డి, భుమారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

పదవీకాలం పూర్తయినా ప్రజాసేవలో..



దోమల మందు పిచికారీ చేస్తున్న గాడ్గే మీనాక్షి

ఇచ్చోడ: తమ పదవీకాలం పూర్తయినా పారిశుధ్య నిర్వహణకు నడుం బిగించారు ముఖరా(కే) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి. మంగళవారం గ్రామంలోని పలు వార్డుల్లో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవులు వస్తూ పోతుంటాయని, పదవికి మాత్రమే విరామమని, ప్రజాసేవకు కాకూడదన్నారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య నిర్వహణకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విజయవాడ టు సూరత్‌కు గంజాయి



గంజాయితో జీఆర్‌పీ పోలీసులు

మంచిర్యాలక్రైం: రైలుమార్గం గుండా విజయవాడ టు సూరత్‌కు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.6,08,500 విలువైన 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న రాత్రి రైల్వే స్టేషన్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై మూడు బ్యాగులు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ఒకరు తప్పించుకుని పారిపోయారు. మిగతా ఒకరిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా 24 కిలోల గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన రామ్ చంద్రస్వైన్, కన్హ బాలాజీ విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఒకరి వద్ద కొనుగోలు చేసి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో సూరత్‌కు బయలుదేరారు. కొంత దూరం ప్రయాణించాక మార్గమధ్యలో పోలీసులను చూసి భయపడి మరో ట్రైన్‌లో వెళ్లేందుకు ఈ నెల 15న రాత్రి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో దిగారు. జీఆర్‌పీ పోలీసులు రామ్‌చంద్ర స్వైన్‌ను పట్టుకోగా కన్హ బాలాజీ స్వైన్ పారిపోయాడు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీఎస్సీ నిర్వాహకుడు ప్రశాంత్‌కు అవార్డు



ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రం తరఫున ఉత్తమ అవార్డు అందుకుంటున్న ప్రశాంత్

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్) నిర్వాహకుడు కొండ ప్రశాంత్ మంగళవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నాడు. సీఎస్సీ 15ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా సీఎస్సీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ సేవలందించిన 30మంది సీఎస్సీల నిర్వాహకులను ఎంపిక చేసి అవార్డు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రశాంత్ ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం. 2019నుంచి 2024వరకు 39,433 డిజిటల్ లిటరసీలో లావాదేవీలు పూర్తి చేయడం ద్వారా అవార్డుకు ఎంపిక చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర అదనపు కార్యదర్శి(అక్షరాస్యత) ఆనంద్‌రావుపాటిల్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సీఏసీ సంజయ్‌కుమార్ రాకేశ్ అవార్డు అందజేశారు.

జీవో 567 సవరించాలి

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించిన జీవో 567ను సవరించి రూ.2 లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి కలిగేలా చూడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం రేషన్ కార్డు ఆధారంగా కార్డులో ఉన్న వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన కుటుంబంతో విడిపడినవారికి రుణమాఫీ వర్తించదన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్ డేటా, పీడీఎస్ (రేషన్‌కార్డు డేటా) ఒకటిగా ఉన్న వారికే వర్తింపజేస్తున్నారని, దీంతో ఆధార్‌కార్డు లేని వారు, పాస్‌బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయని వారంతా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వలన చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయని. పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికి వర్తింపజేయడం జరిగిందన్నారు. ఇలాంటి అనేక కారణాలతో రైతులు నష్టపోయే వీలు ఉన్నందున, రుణమాఫీ జీవోను సరిచేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి



పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, మర్సుకోల జ్ఞానేశ్వర్, రవీందర్, జితేందర్, సంజయ్, మంగల్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శివకుమార్ వర్మ (ఫైల్)

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మరౌత్ శివకుమార్ వర్మ (34) తన స్నేహితులైన ఆదిలాబాద్ జిల్లా గోరటిక లక్‌కు చెందిన బర్దలాల్ శివకుమార్, నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌కు చెందిన కస్నుల అరుణ్, ముచ్చర్ల గ్రామానికి చెందిన సాయిరెడ్డిలతో కలిసి నాలుగు రోజుల క్రితం గోవా వెళ్లాడు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుని మేడ్చల్‌లో ఉండే తన బంధువుల ఇంటికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. మంగళవారం వేకువ జామున 3.30 గంటల సమయంలో కారులో ముగ్గురు స్నేహితులతో పాటు బంధువు ఇంట్లో ఉన్న భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు అరణ్యలను తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. శివకుమార్ వర్మ కారును నడిపిస్తూ శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు సగభాగం లారీ కిందికి చొచ్చుకుపోయి నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న శివకుమార్ వర్మ అక్కడికక్కడే మృతి చెందగా.. అతని భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు అరణ్య, స్నేహితులైన అరుణ్, సాయిరెడ్డి, బి.శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తృటిలో తప్పిన ప్రమాదం



చిట్యాల బ్రిడ్జిని ఢీకొన్న లారీ

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద మంగళవారం తృటిలో ప్రమాదం తప్పింది. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం... భైంసా నుంచి నిర్మల్ వైపు లోడుతో వస్తున్న లారీ మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బ్రిడ్జి పైన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై లారీ నుండి కిందికి దూకేశారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్ సహాయంతో లారీని తీసి పక్కకు జరిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుండి రూ.53,180 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామ శివారులోని మామిడితోటలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగదును సీజ్‌చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ చోరీ నిందితుడి అరెస్ట్

భైంసాటౌన్: ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ఈ నెల 14న మదీనాకాలనీలోని ఓ ఇంటి ముందు ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. దీంతో సోమవారం ట్రాక్టర్ యజమాని మహ్మద్ ఒమర్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా స్థానిక భోకర్ చౌరస్తా వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హత్‌గావ్‌కు చెందిన నిందితుడు నిఖిల్‌రాజును అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కేసును 24గంటల్లో ఛేదించిన సీఐ రాజారెడ్డి, ఎస్సైలు షరీఫ్, గౌసుద్దీన్, సిబ్బందిని ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్ అభినందించారు.